త్వరలోనే పింఛన్లు పెంచుతాం

- తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్
- 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసింది
- ధరణితో రైతుకే అధికారమిచ్చాం
- కాంగ్రెస్, బిజెపిలు ఒక్కటే
- ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బిఆర్‌ఎస్‌ను గెలపించాలి
- సూర్యాపేటలోని ప్రగతి నివేదన సభలో ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో పింఛన్లు పెంచుతామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు తగ్గాయని సిఎం కెసిఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్‌పి, కలెక్టర్ కార్యాలయాలు ప్రారంభించిన అనంతరం జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సూర్యాపేట జిల్లా కావడం ఒక చరిత్ర అని అన్నారు. రూ. వంద కోట్లతో ప్రభుత్వ కార్యాలయాలను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలో 23వ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరంగా ఉందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేయలేదని, కాంగ్రెస్ తన జన్మలో రూ.వెయ్యి పెన్షన్ ఇవ్వలేదని.. రూ. 200 పెన్షన్ ముఖాన కొట్టారని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. నాలుగు వేలు పెన్షన్ ఇస్తామంటున్న కాంగ్రెస్.. అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్, కర్ణాటకలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒకరు మోటర్లకు మీటర్లు పెట్టాలని అంటున్నారని, మరొకరు మూడు గంటల ఉచిత విద్యుత్ చాలు అంటున్నారంటూ కాంగ్రెస్, బిజెపిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి తీసేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ధరణి తీసేస్తే మళ్లీ పాత కథే మొదటి కొస్తుందని, దరఖాస్తులతో ఆఫీసుల చుట్టూ రైతులు తిరగాలా అని ప్రశ్నించారు. ఒక్కసారి ధరణిలోకి భూమి ఎక్కితే మార్చే అధికారం తనకూ లేదని, రైతు బొటన వేలుకే ఆ అధికారం ఉందని స్పష్టంచేశారు. దశాబ్దాల తరబడి మూసీ మురికి నీరు తాగించారని, ఇప్పుడు నల్లగొండలో అల్ట్రా మెగాపవర్ ప్లాంట్ రాబోతోందని తెలిపారు. రూ.37 వేల కోట్ల రైతుల రుణమాఫీ చేశామని.. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ ఎక్కడా చేయలేదని చెప్పారు.

తెలంగాణ మూడు కోట్ల టన్నుల వడ్లు పండిస్తోందని.. త్వరలో పంజాబ్‌ను మించి నాలుగు కోట్ల టన్నుల వడ్లు పండించబోతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో వలస పోయినవాళ్లంతా వాపస్ వచ్చారని గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిందని తెలిపారు. తలసరి విద్యుత్ వినియోగంలోనూ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు తగ్గిపోయాయని తెలిపారు. ఒకప్పుడు ఫ్లోరైడ్‌తో ఇబ్బంది పడిన రాష్ట్రం ఇప్పుడు జీరో ఫ్లోరోసిస్ స్టేట్‌గా మారిందన్నారు. వీఆర్‌వో వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే తొలగించామన్నారు. కాళేశ్వరం నీరు.. 480 కి.మీ ప్రయాణించి సూర్యాపేట జిల్లాకు వస్తున్నాయన్నారు. అందరి కృషితోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతి గ్రామ పంచాయతీకి రూ.పది లక్షల చొప్పున నిధుల మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. సూర్యాపేట మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.50 కోట్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు గెలిచినట్టేనని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బిఆర్‌ఎస్‌ను గెలపించాలని సిఎం కెసిఆర్ కోరారు. సభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి అంజని కుమార్, మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, రమవత్ రవీంద్ర నాయక్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, నోముల భాస్కర్ రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కలెక్టర్ యస్ వెంకట్రావు, ఎస్‌పి రాజేంద్రప్రసాద్, జడ్‌పి చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి అన్నపూర్ణ పాల్గొన్నారు.

మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిని ప్రారంభించిన స్పీకర్ పోచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు, చిన్నారుల కోసం అత్యాధునిక వైద్య సదుపాయాలతో హైటెక్‌సిటీ మెటల్ చార్మినార్ ఎదురుగా నిర్మించిన మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అత్యుత్తమ వైద్య సేవలతో అతితక్కువ కాలంలోనే మెడికవర్ ఆస్పత్రి 25 శాఖలుగా విస్తరించడం గొప్ప విషయమన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా అన్ని వయస్సుల వారికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆస్పత్రి ఏర్పాటుచేయడం గొప్ప విషయమని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ, మహిళలు, గర్భిణీలు, నవజాత శిశువులకు ప్రపంచస్థాయి వైద్యం అందిచాలనే లక్ష్యంతో ఆస్పత్రిని నెలకొల్పినట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో 24 గంటల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు ఏడాదికి ఒక్కసారైనా వైద్య పరీక్షలుచేసుకోవడం ఎంతోమేలని అన్నారు. కార్యక్రమంలో హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు, ఆర్‌టిసి ఎండి సజ్జనార్, హైదరాబాద్ సిపి సివి ఆనంద్, సీనియర్ వైద్యులు శరత్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, హరికృష్ణ, రవీందర్ రెడ్డి, రాధిక, మీనాక్షి, వరలక్ష్మి, అనూష రెడ్డి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నేడు బిఆర్‌ఎస్ తొలి జాబితా?

- 105 మంది పేర్లను ప్రకటించనున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితాను సోమవారం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ప్రకటించనున్నట్టు సమాచారం. మొత్తం 105 మంది అభ్యర్థుల జాబితాను ఆయన ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మెజారిటీ అభ్యర్థులు సిట్టింగులే కాగా, దాదాపు ఎనిమిది నుంచి పదిమంది కొత్త అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దీనిపై ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ తుదినిర్ణయానికి వచ్చేశారనీ, టిక్కెట్ రాని సిట్టింగులకు ఎమ్మెల్సీలు లేదా కార్పొరేషన్ల చైర్మెన్ల పోస్టులు వంటివి ఇస్తామని ఒప్పించే ప్రయత్నం జరుగుతోందని పార్టీలో ప్రచారం ఉంది. ప్రస్తుత సిట్టింగ్స్‌లో దాదాపు 20 నుంచి 22 మందికి ఈ సారి టిక్కెట్ ఇచ్చే పరిస్థితులు లేవని గతంలోనే సిఎం స్పష్టం చేశారని వారు గుర్తుచేస్తున్నారు. మారిన రాజకీయ సమీకరణాలు, సిట్టింగుల పనితీరు, అవినీతి, అక్రమాల అరోపణలు, భూ కబ్జాలు వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొనే ముఖ్యమంత్రి వారికి టిక్కెట్లు నిరాకరిస్తున్నారని ప్రచారం జరుగుతుంది. టిక్కెట్ల కోసం ఇప్పటికే ప్రగతిభవన్ చుట్టూ నేతల ప్రదక్షిణలు కొనసాగుతున్నాయి. ఈ తాకిడి తట్టుకోలేకే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె తారకరామారావు అమెరికా వెళ్లిపోయారు. ఇక్కడి పరిస్థితులు కాస్తో కూస్తో సద్దుమణిగాక, ఓ వారం తర్వాత ఆయన తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు. ఈలోపు స్థానికంగా బుజ్జగింపులు, సర్దుబాట్లు చేసుకోవాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. టిక్కెట్లు రాని సిట్టింగులకు పార్టీ అధిష్టానం ఇప్పటికే సమాచారం ఇచ్చేసినట్టు ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో అసంతృప్తి నేతలకు ప్రగతిభవన్ గేట్లు తెరుచుకుంటాయో లేదో అనే చర్చ ఇప్పుడు కొనసాగుతుంది.

దేశంలో తొలి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ

- మాతా, శిశు సంరక్షణ కేంద్రం
- గాంధీ ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో తొలి ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ మాతా, శిశు సంరక్షణ కేంద్రం గాంధీ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. 200 పడకలతో కూడిన ఈ ఆస్పత్రిని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో 200 పడకలు గర్భిణులు, 100 పడకలు శిశువుల కోసం ఉన్నాయని తెలిపారు. వీటికి తోడు సూపర్ స్పెషాలిటీ కింద మరో 200 పడకలతో మొత్తం 500 బెడ్లకు చేరింది. దీంతో పాటు ఆధునిక డైట్ కిచెన్‌ను, 33 నియోనాటల్ అంబులెన్సులను మంత్రి ప్రారంభించారు.

మరింత తగ్గనున్న మాతా, శిశు మరణాలు

కొత్తగా వచ్చిన సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, 33 నియోనాటల్ అంబులెన్సులతో తల్లులు, పిల్లల మరణాల సంఖ్య మరింత తగ్గుతుందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్లిష్ట నవజాత కేసులను మారుమూల ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తరలించే క్రమంలో మరణాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీన్ని నివారించేందుకు 33 జిల్లాల్లో 33 నియోనాటల్ అంబులెన్సులను అందుబాటులో పెడుతున్నట్టు తెలిపారు. దీంట్లో ఆక్సిజన్‌తో పాటు అన్ని సదుపాయాలుంటాయని వివరించారు.

పాటు నిమ్స్, అల్వాల్ టిమ్స్‌లో ఒక్కో ఆస్పత్రిలో 200 పడకల చొప్పున సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు ఆరోగ్య కేంద్రాలు రానున్నాయని వెల్లడించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఎక్కువ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న తల్లులు, పిల్లలకు చికిత్స చేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. గర్భిణులకు డయాలసిస్ సేవలున్నాయని చెప్పారు. గుండె, కిడ్నీ, కాలేయం, న్యూరో తదితర మల్టిపుల్ వ్యాధులతో బాధపడే తల్లులకు, పిల్లలకు సూపర్ స్పెషాలిటీ సేవలందుతాయని తెలిపారు. కెసిఆర్ కిట్, కెసిఆర్ న్యూట్రిషన్ కిట్‌తో పాటు పలు రకాల చర్యలతో ఇప్పటికే మాతా, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. దేశంలోనే అతి తక్కువగా తల్లులు, శిశువుల మరణాలున్న మూడో రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.

త్వరలో సంతాన సాఫల్య కేంద్రం

పెట్లబురుజు ప్రసూతి ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రాలను త్వరలో సంతాన సాఫల్య కేంద్రాలను ప్రారంభించనున్నట్టు మంత్రి హరీశ్ రావు తెలిపారు. వీటితో పాటు గాంధీ ఆస్పత్రిలో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ ను కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. క్వాలిటీ మేనేజ్మెంట్, హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్మెంట్లో తొలిసారిగా గాంధీ ఆస్పత్రికి ఐఎస్ఒ సర్టిఫికేషన్ రావడం పట్ల మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు వాణీదేవీ, బేగ్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి

మోడీ సర్కార్ ఆదేశాలతోనే సూర్జిత్ భవనంపై దాడి

- సెప్టెంబర్ ఒకటి నుండి 7 వరకు అధిక ధరలు, నిరుద్యోగంపై దేశవ్యాప్త ఆందోళనలు
- 10 నుండి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు : చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రగతిశీల శక్తులకు భయపడిన మోడీ సర్కార్ ఢిల్లీలోని సూర్జిత్ భవన్‌పై దాడికి పాల్పడిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీ-20 సమావేశాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని హరికిషన్ సుర్జిత్ భవన్‌లో కవులు, కళాకారులు, మేధావులు ఈ నెల 18, 19 తేదీల్లో సమావేశాలు నిర్వహించుకుంటుంటే అడ్డుకున్న పోలీసులు.. మీటింగ్‌కు పర్మిషన్ లేదని, రద్దు చేసుకోవాలని చెప్పడం బిజెపి కుట్రలో భాగమేనన్నారు. ఈ సంఘటన బిజెపి నియంతృత్వ పోకడకు నిదర్శమన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలపై సెప్టెంబర్ ఒకటి నుండి ఏడు వరకు వారం రోజులపాటు దేశవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. దేశంలో రోజురోజుకు పేదల సంఖ్య, దరిద్రం పెరుగుతుందని, కోటీశ్వరుల సంఖ్యా పెరుగుతోందని, గతంలో దేశంలో 124 మంది కోటీశ్వరులు ఉంటే ప్రస్తుతం 145 మంది ఉన్నారన్నారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలను అన్ని పోరాట కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, తెలంగాణలో బిజెపి ఆటలను కట్టడి చేయడం కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజుగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొడుకు కొట్టాడని.. వృద్ధ దంపతుల ఆత్మహత్య

- ఆస్తి తగాదాలే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడుకు, కోడలు ఆస్తి కోసం గొడవ చేయడంతోపాటు, కొడుకు తల్లిదండ్రులను కొట్టడంతో వారు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనికరపు దేవయ్య (70), లక్ష్మి నర్సవ్వ (65) దంపతులకు ఇద్దరు కుమారులు రవీందర్, మల్లేశం ఉన్నారు. వీరిద్దరూ ఆస్తి పంపకాలు చేసుకొని ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. పెద్ద కొడుకు రవీందర్ తన ఇంటికి దారి లేదని, తల్లిదండ్రుల ఉన్న పాత ఇంటిని కూల్చి వేయాలని వారిపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తల్లిదండ్రులపై దాడి చేసి, ఇంట్లో ఉన్న కుల దైవాన్ని ఇంటినుంచి బయటకు తీసుకెళ్తామని గొడవకు దిగారు. దాంతో తీవ్ర మనస్తానికి గురైన దంపతులు ఇంట్లోనే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో దైవాన్ని బయటకు తీసుకురావడానికి కుటుంబ సభ్యులతో వెళ్లిన ఒగ్గు వాళ్లు ఇంటి తలుపులు తట్టగా.. వారు తీయలేదు. దాంతో అనుమానం వచ్చి చిన్న కొడుకు మల్లేశం ఇంటి పైకి ఎక్కి చూడగా.. తల్లిదండ్రులిద్దరూ విగత జీవులుగా పడిఉన్నారు. వెంటనే వారిని వేములవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిన్న కొడుకు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఫొటో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి హరీష్ రావు

ప్రజాశక్తి కల్చరల్

గతంలో పత్రికా ఫొటోగ్రాఫర్లకు ఫోటో జర్నలిస్ట్‌గా అక్రిడిటేషన్ కార్డులో వుండేదని కానీ నేడు ఫోటోగ్రాఫర్‌గా మార్పు చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తప్పకుండా వారి సమస్య పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య ఆర్థిక శాఖామంత్రి తన్నీరు హరీష్ రావు హామీ నిచ్చారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా.రవీంద్ర భారతి సమావేశ మందిరంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనలో గెలు పొందిన ఛాయాగ్రహకులకు బహుమతి ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా హరీష్‌రావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఫోటో జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి విలువైన ఫోటోలు అందించారని గుర్తు చేసుకొన్నారు. ఫోటో పద్యమంత చిన్నదే కావచ్చు కానీ భావం తాత్పర్యంలో ఎంతో అర్ధం ఉంటుందన్నారు. ఫొటో ఏ సందర్భందైన దానిలో ఆత్మీయత, ప్రేమ, బాధ అన్నీ అద్భుతంగా ఆవిష్కృతం అవుతాయన్నారు. దిన పత్రికలులో వార్త పూర్తిగా చదివే సమయంలేకున్నా ఫోటో చూసి సారాంశం గ్రహించవచ్చునని తెలిపారు..అధ్యక్షత వహంచిన మీడియా అకాడెమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ అత్యధికంగా అక్రెడిటేషన్‌లు తెలంగాణలోనే వున్నాయని తెలిపారు. వంద కోట్లు జర్నిస్టుల సంక్షేమ నిధికి ప్రభుత్వం కేటాఇంచిదన్నారు. త్వరలో జర్నలిస్ట్ భవన్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి విజేతలకు బహుమతులు అందజేశారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు భాస్కర్ కార్యక్రమాన్ని నిర్వహించారు శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

వరంగల్‌కు రూ.250 కోట్ల తక్షణ సాయం

- ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరంలోని వరద బాధితులకు తక్షణ సహాయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిందనివరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. ఆదివారం హన్మకొండ జిల్లా కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ(కుడా) కార్యాలయంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, కుడా చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్, తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో పెద్ద ఎత్తున వర్షం నమోదు కాగా నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, డ్రయినేజీలు, నాలాలు తెగిపోయాయన్నారు. అప్పుడు నగరాన్ని సందర్శించిన మంత్రి కెటిఆర్ తక్షణ సాయం కింద రూ.20 కోట్లు తర్వాత రూ.100 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. ఈ ఏడాది అంతకంటే రికార్డు స్థాయిలో 275 మి.మీ వర్షపాతం నమోదయిందన్నారు. దాంతో నీట మునిగి ముంపునకు గురయిన సమ్మయ్య నగర్, రామ్ నగర్, జవహర్ నగర్, తదితర కాలనీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రూ.1000 కోట్ల వరకు ఎస్టిమేషన్స్ పంపించినట్టు తెలిపారు. దాంతో తక్షణ సహాయం కింద రూ.250 కోట్లు కేటాయించారని, అందుకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణకు గురైన నాలాలను పూర్తిగా తొలగించే దిశగా ఆదేశాలున్నాయని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనేక ముంపు ప్రాంతాలను సందర్శించి రూపాయి కూడా ఇవ్వలేదని, ఆర్థికంగా కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందించలేని దుస్థితిలో ఉన్నారని ఆరోపించారు. కేంద్రం నుంచి ఏం నిధులు తెచ్చి నగరాభివృద్ధికి కృషి చేశారో వరంగల్ నగర ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని తెలిపారు. తక్షణ అభివృద్ధి కింద చేపట్టాల్సిన పునర్నిర్మాణ పనులపై అధికారులనూ ఆదేశించినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బిజెపి నాయకులు అవగాహన లేని మాటలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కెసిఆర్, కెటిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, అశోక్ యాదవ్, రంజిత్ రావు, కుడా మాజీ డైరెక్టర్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరణ పనులు ఇంకెప్పుడు?

- కళావిహీనంగా సరోజినీదేవి హాస్పిటల్
- కరోనా రాకతో ఆగిన అప్‌గ్రేడేషన్ పనులు
- తిష్ట వేసిన పలు సమస్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని చారిత్రక సరోజినిదేవి కంటి హాస్పిటల్ ఇప్పట్లో మహర్దశకు నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఉస్మానియా మెడికల్ కాలేజీ, గాంధీ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఏకైక కంటి హాస్పిటల్ ఇది. ఏండ్లుగా హాస్పిటల్ ఆధునీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ఇప్పుడు తెలంగాణలో ఉచిత సూపర్-స్పెషాలిటీ కంటి సంరక్షణ సౌకర్యాలకు విస్తృతంగా ప్రసిద్ధి చెందిన ఈ హాస్పిటల్.. దశాబ్దాలుగా నిధుల కొరతతో కళా విహీనంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉన్నప్పటికీ చాలీచాలని సౌకర్యాలు, వసతుల లేమితో హాస్పిటల్‌కు వెళ్లాలంటే భయపడే రోజులు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఓపీ విభాగం, ఎమర్జెన్సీ వింగ్‌ల్లో గోడలు, పైకప్పులపై తేమతో దర్శనమిస్తుండగా.. హాస్పిటల్ గోడలు భయపెట్టేలా పగుళ్లతో కనిపిస్తుంటాయి. సిరామిక్ టైల్స్ ఫ్లోరింగ్, సీలింగ్, టాయిలెట్లు, చెక్క తలుపులు, కిటికీలు, కుళాయిలు దయనీయ స్థితికి చేరాయి.

రూ.400 కోట్లతో ఆధునీకరణ పనులు..

తృతీయ సంరక్షణ రెఫరల్ కంటి హాస్పిటల్‌గా పేరొందిన సరోజినిదేవి కంటి హాస్పటల్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాల నుంచీ కంటి చికిత్స కోసం ఈ హాస్పిటల్‌కు వస్తూ ఉంటారు. మెహిదీపట్నం దగ్గరలోని 10.79 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ హాస్పిటల్ క్యాంపస్‌లో 50 పడకల సామర్థ్యంతోపాటు అవుట్ పేషెంట్ భవనం, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ వార్డులు ఉన్నాయి. హాస్పిటల్ దుస్థితిపై అనేక మంది ఫిర్యాదు చేయడం, మీడియాలో కథనాలు రావడంతో కొన్నేండ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎస్‌ఎంఎస్‌ఐడిసి), హాస్పిటల్ సముదాయంలో ఉన్న భవనాలపై సర్వే నిర్వహించింది. క్యాంపస్‌లోని దాదాపు అన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొత్త క్యాంపస్ నిర్మాణానికి దాదాపు రూ.400 కోట్లు ఖర్చవుతుందని నివేదికను అందించారు. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడేషన్ పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. అంతలోనే కరోనా రావడంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిలిచిపోయింది. కాగా, గత నెలలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సరోజినీదేవి హాస్పిటల్‌లో నేత్ర సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. దాంతో హాస్పిటల్‌లో కాంప్లెక్స్ నిర్మాణ ప్రాజెక్ట్ మళ్లీ ప్రారంభమవుతుందని, హాస్పటల్‌లో సౌకర్యాలు మెరుగవుతాయని అందరూ భావించారు. కానీ మంత్రి పర్యటించి నెల అవుతున్నా.. ఇప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

హాస్పిటల్‌లో కొన్ని సమస్యలు ఇలా..

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో పేరున్న ఈ హాస్పిటల్ ఇప్పుడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాత భవనంలోనే వైద్యం అందిస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. వైద్యులు, సిబ్బంది కొరతతోపాటు రోగుల రద్దీకి తగ్గట్టుగా భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 50 పడకల సామర్థ్యం గల ఈ హాస్పిటల్‌కు ప్రతి రోజూ 900 నుంచి 1100 వరకు ఓపీ విభాగంలో రోగులు వస్తూ ఉంటారు. ఇక్కడ పదుల సంఖ్యలో రెటీనా, కార్నియా, గ్లకోమా, ఓకులోప్లాస్టీ వంటి రోగాలకు శస్త్రచికిత్సలు చేస్తూ ఉంటారు. సుమారు 50 మంది వరకు పని చేయాల్సిన చోట సరిపడా వైద్యులు లేకపోవడంతో మెరుగైన సేవలు అందించడం గగనంగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్సలు సైతం వాయిదా పడుతుండడంతో జిల్లాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంత మందికి కంటి ఆపరేషన్ తర్వాత అద్దాలను కూడా ఇవ్వలేని దయనీయస్థితిలో ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.419/2021

1. పూసలపాటి కేశవులు
2. దిబ్బగండ్ల అలియాస్ ఆర్ధవీటి రంగనాయకులు

...వాదులు

ఎదిరి

అర్ధవీడు చిన్నపుల్లయ్య అలియాస్ అర్ధవీటి నాలుగవ పుల్లయ్య ...ప్రతివాది

టు,
అర్ధవీడు చిన్నపుల్లయ్య అలియాస్ అర్ధవీటి నాలుగవ పుల్లయ్య తండ్రి శాయన్న, వయస్సు : 55సం॥లు, హిందూ, ఎక్స్ఆర్మీ, డోర్.నెం.బి1-14-15-332, లాస్ట్ బస్టాప్ లైన్, ఎన్.ఎఫ్.సి నగర్, ఘటకేశ్వర్, కెవి.రంగారెడ్డి-501 301, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలోని వాదులు దావా పరిహారం రాగోరి గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీపై దావాను దాఖలు చేసినందున సదరు దావాలో మీరు పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకువాయిదా తేది:22.08.2023న వున్నది. మీరు వాయిదా రోజు సమయం ఉదయం 10:30ని॥లకు మీరు స్వయముగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

గిద్దలూరు
తేది:20.08.2023

భూతపాటి ఐజాక్
అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.8639368889

దేశానికి నేడు కమ్యూనిస్టుల అవసరం పెరిగింది

- విప్లవోద్యమంలో అంతర్భాగమే సామాజిక న్యాయ పోరాటం
- సమరశీల పోరాటాల్లో వామపక్షాల ఐక్యత పెరగాలి
- దేశం ముందుకెళ్లడంలో విద్య, సైన్స్, టెక్నాలజీదే కీలక పాత్ర
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో కమ్యూనిజాన్ని, ఎర్రజెండాను నిలబెట్టడమే ప్రజాకవి గద్దర్‌కిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సామాజిక న్యాయ పోరాటం విప్లవోద్యమంలో అంతర్భాగమేనని నొక్కి చెప్పారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సమరశీల పోరాటాల్లో వామపక్షాల ఐక్యత పెరగాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. దీనికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేశ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. వామపక్ష పార్టీల ముఖ్యనేతలు, కవులు, కళాకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గద్దర్ మృతికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. విప్లవ కవి, కళాకారుడు, కమ్యూనిస్టు యోధుడు, ప్రజల మనస్సు గెలిచిన గొప్ప నాయకుడు గద్దర్ అని కొనియాడారు. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న సందర్భంలో, పాలకులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న క్రమంలో వీటిని ఎదిరించేందుకు ఎవరు ముందుకొచ్చినా కలిసి పనిచేస్తానని గద్దర్ పలు సందర్భాలలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం పేరుతో సిపిఎం చేపట్టిన మహాజన పాదయాత్ర, టీమాస్ కార్యక్రమాల్లో గద్దర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆ సమయంలోనే గద్దర్‌తో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం తనకు లభించిందన్నారు. మార్క్సిజం, అంబేద్కరిజం పరస్పర విరుద్ధ అంశాలు కావన్నారు. కొన్ని అంశాల్లో భేదాభిప్రాయాలుండొచ్చని, అంతిమంగా ఆ రెండింటి స్ఫూర్తి సామాజిక న్యాయమనే విషయాన్ని మరవొద్దని సూచించారు. కమ్యూనిజాన్ని సాధించడంలో సామాజిక న్యాయం అంతర్భాగంగానే ఉంటుందనీ, అది వేరు కాదని చెప్పారు. మన దేశంలో కుల వ్యవస్థ రూపుమాపకుండా అభివృద్ధి సాధించడం అసంభవమన్నారు. ఇది కులం గురించో, రాజకీయ పార్టీ గురించో, ఎన్నికల్లో సీట్ల కోసమో ఇచ్చే నినాదం కాదన్నారు. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు కమ్యూనిస్టుల అవసరం వచ్చిందని నొక్కి చెప్పారు. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే బలహీనపడ్డ, దెబ్బతిన్న చోటల్లా కమ్యూనిజం తిరిగి బలపడ్డదన్నారు. రాజ్యాధికారం సాధించే చోదక శక్తిగా ఎదిగిన తీరును వివరించారు. సమాజం అభివృద్ధి చెందాలన్నా, ప్రపంచ దేశాల్లో అగ్రదేశంగా ఎదగాలన్నా విద్య, సైన్స్, టెక్నాలజీ కీలకమన్నారు. మంచి పరిపాలనే కాదు మెరుగైన సామాజిక వ్యవస్థ కూడా కీలకమని చెప్పారు. కానీ, మన దేశంలో ఆ పరిస్థితి లేదన్నారు. సైన్స్, టెక్నాలజీని కలిపి ముందుకు తీసుకెళ్లడంలో మన పాలకులు విఫలమయ్యారన్నారు. బాగా చదివినవాళ్లు పనిచేయట్లేదనీ, పనిచేసేవాళ్లు విద్యలేక టెక్నాలజీ అందిపుచ్చుకోలేకపోతున్నారని చెప్పారు. మన దేశ వెనుకబాటుకు ఇదీ ఒక కారణమేనని చెప్పారు.

గొప్ప మిత్రుడు..ప్రపంచ కళాకారుడు : బి.నర్సింగరావు

గద్దర్ తనకు గొప్ప మిత్రుడనీ, ఆయన ప్రపంచం గుర్తించిన కళాకారుడని సినీ నిర్మాత, దర్శకులు బి నర్సింగరావు అన్నారు. ఐదు దశాబ్దాల పాటు గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన మొదట బుర్రకథ కళాకారుడని, ఆ తర్వాత ప్రజలను ఆకట్టుకునేందుకు అన్ని కళారూపాలను మిళితం చేసి తనదైన ఒరవడితో ముందుకు సాగారని చెప్పారు. ఆటపాట ద్వారా ప్రజల్ని ఎలా ఆకర్షించాలనే దానిపై తమ టీమ్ పెద్ద కసరత్తునే చేసిందని, అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించేవారమని గుర్తు చేశారు. ఆయన పాటల్ని చాలా కాలం పాటు ఎడిట్ చేశానన్నారు. ఆయన రాసిన పాట దేనికదే ప్రత్యేకమన్నారు. పాట కోసం తన ప్రాణాలను సైతం ఆయన లెక్కచేయలేదని, ఆయనపై 36 కేసులూ ఉన్నాయని చెప్పారు.

ఎర్రజెండాకు నిజమైన వారసుడు : కూనంనేని సాంబశివరావు

గద్దర్ ఎర్రజెండాకు నిజమైన వారసుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా ఆయన మనకు పాటనిచ్చి పోయారన్నారు. పేదల బతుకులను, సమాజాన్ని లోతుగా చదివినవారే గొప్ప కవులవుతారంటూ గద్దర్ పాటలను ప్రస్తావించారు. బతికున్నప్పుడు వేధించినవారు, ఆయన ప్రశ్నను సహించలేనివారు చనిపోయాక తమ వాడిని చేసుకునేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చరిత్రలో గొప్పగొప్ప కళాకారులంతా కమ్యూనిస్టు విప్లవ భావజాలం నుంచే పుట్టారన్నారు. పాలకుల్ని ప్రశ్నించే గొంతుకలన్నీ ఒక్క తాటిపైకొచ్చి పోరాటం చేయడమే గద్దర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు.

పాటల విశ్వవిద్యాలయం గద్దరన్న : సుద్దాల అశోక్ తేజ

గద్దర్ పాటల విశ్వవిద్యాలయమనీ, సముద్రమంతా సిలబస్‌ను మనకు ఇచ్చిపోయారని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రకృతిలోనూ విప్లవ భావజాలాన్ని జొప్పించిన మహనీయుడన్నారు. ఆయన తనకు గురువు లాంటివారన్నారు. ప్రజల నుంచి తీసుకున్న కళను ప్రజలకే అప్పగించి పోయారన్నారు. పాటలో 'హ' అనే శబ్దాన్ని, చరణం చివరన కొసమెరుపు వాక్యాలను, చరణానికి–చరణానికి మధ్య వారధిని సృష్టించిన ఘనత ఆయనదేనన్నారు. పాట ఆకాశమైతే దాని అంచుకెళ్లి ముద్దాడిన మహనీయుడని కొనియాడారు. ఈ యుగం గద్దరన్నదని చెప్పారు. సుద్దాల హన్మంతు, గద్దర్ పాటలు పాడి సభికుల్ని ఉత్తేజపరిచారు.

ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ గద్దర్‌తో పోల్చదగిన వ్యక్తి ఇంకెవ్వరూ లేరని అన్నారు. నిఖార్సయిన విప్లవకారుడన్నారు. ప్రజల జీవితాలను ఒడిసిపట్టి పాటలల్లిన విప్లవ కవి ఆయనని చెప్పారు. సిపిఐ (ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం, విప్లవ పోరాటాలు గద్దర్‌ను సృష్టించాయని చెప్పారు. తన పాటలతో మంటలను రాజేశాడనీ, విప్లవోద్యమానికి ఊపిర్లూదాడని కొనియాడారు. గద్దర్ కూతురు వెన్నల మాట్లాడుతూ గద్దర్ గొప్ప మానవత్వం ఉన్న మనిషి అని చెప్పారు.సమానత్వం కలిగిన సమాజం కావాలని కోరుకున్నారని తెలిపారు. నూతన తరం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని తపన పడ్డాడని గుర్తు చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడటమే గద్దర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కుల, మత వైషమ్యాలను సృష్టించి ఈశాన్య భారతాన్ని మండిస్తున్న తరుణంలో గద్దర్ లేకపోవటం లోటేనన్నారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ సాంస్కృతిక విప్లవ సేనాని గద్దర్ అని చెప్పారు.ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురారి మాట్లాడుతూ గొప్ప ప్రజావాగ్గేయ కారుడు గద్దర్ అని చెప్పారు. ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షులు ప్రసాదన్న, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాదన్న, న్యూడెమోక్రసీ నాయకులు చలపతిరావు, జనశక్తి నాయకులు కొమరన్న లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా ఆయన ఆశయాల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

గద్దర్ మ్యూజియం కోసం ఐదెకరాలివ్వాలి
సంస్మరణసభలో వామపక్ష పార్టీల తీర్మానం

హైదరాబాద్ ప్యాట్నీ సెంటర్ వద్ద ప్రజా యుద్ధనౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ విగ్రహాన్ని నెలకొల్పాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఆయన పేరిట గద్దర్ ప్రజా కళల మ్యూజియం, గద్దర్ ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలనీ, దాని నిమిత్తం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. వాటిలో గద్దర్‌తో పాటు ప్రముఖ కళాకారుల ఆవిష్కరణలు, చరిత్రను అందుబాటులో పెట్టాలన్నారు. ఈ మేరకు "గద్దర్ సంస్మరణ సభ" తీర్మానించింది.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నడుస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. టీచర్ల సర్దుబాటు పేరుతో క్రమబద్ధీకరణ చేస్తూ కేవలం 5,600 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ దస్త్రం పంపడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రీప్రైమరి తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసందానించే ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మనబడి పథకంలో అభివృద్ధి చేస్తున్న సందర్భంలో వాటి రక్షణకు సర్వీసు పర్సన్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య మాట్లాడుతూ ఎన్ఇపి–2020 విధానం అమల్లో ప్రి ప్రైమరీ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగిస్తే దేశ వ్యాప్తంగా విద్యారంగం ప్రయివేటీకరణకు, కార్పొరేటీకరణకు దోహపడుతుందనీ, పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2018 పిఆర్‌సికి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు చేపట్టిన బదిలీ ఉత్తర్వులను వెంటనే అమలయ్యే విధంగా చూడాలన్నారు. కెజిబివి ఉద్యోగ, ఉపాధ్యాయ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఉపాధ్యాయులకు బేసిక్ పే అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.రాములు, సిహెచ్.దుర్గాభవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ.వెంకట్, యం.రాజశేఖర్‌రెడ్డి, కె.సోమశేఖర్, వి.శాంతికుమారి, డి.సత్యానంద్, కె.రంజిత్‌కుమార్, బి.నాగమణి, బి.రాజు, ఈ.గాలయ్య, కె.రవిప్రసాద్‌గౌడ్, కె.రవికుమార్, జి. శ్రీధర్, వై. జ్ఞానమంజరి, ఎ. సింహాచలం, ఆడిట్ కమిటీ కన్వీనర్ యస్‌కె. మహబూబ్ అలి, యస్‌వై. కొండల్‌రావులు పాల్గొన్నారు.

జీనియస్ గ్లోబల్ రికార్డ్ కెక్కిన తెలుగు వాగ్గేయకార వైభవం

ప్రజాశక్తి - కల్చరల్

వైవిధ్యం వైభవం కలగలిసి తెలుగు వాగ్గేయ కారు వైభవం పేరిట రవీంద్రభారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడెమీ ఎబిసి ఫౌండేషన్ నిర్వహణలో సంగీత గాన గోష్ఠి జరిగింది. 18 మంది గురువులు, రామ దాసు అన్నమయ్య ఇద్దరు వాగ్గేయకారుల కీర్తనలు 303 మంది శిష్య బృందం ఎనిమిది గంటల పాటు నిర్విరామంగా గానం చేశారు. జీనియస్ గ్లోబల్ రికార్డ్ ప్రతినిధి రమణారావు వీరి విన్యాసం రికార్డ్ కెక్కినట్లు ప్రకటించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు మా కార్యవర్గ సభ్యుడు మాణిక్ అవార్డ్సును అందజేసి మాట్లాడారు. కోట్ల ధనం సంపాదించినా వెంట రాదని పిల్లలకు మనం నేర్పే సంస్కారం, విద్య కళలు మాత్రమే సమాజంలో గుర్తింపు తెస్తాయన్నారు. తల్లితండ్రులు వారు నేర్చుకోలేక పోయినా పిల్లలకు కళలను నేర్పించి ఆనంద పడటం సహజం అన్నారు సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ హాజరయిన సభకు లలితారావు స్వాగతం పలికారు. 303 గాయకులకు వాయిద్య సహకారం అందించిన ఫణి బాల శర్మను ప్రత్యేకంగా అభినందిచారు.

మోడీ తన మిత్రుడికి.. కెసిఆర్ తన కుటుంబానికి దోచిపెడుతున్నారు

- బిజెపిది విభజించు పాలించు విధానం
- దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి
- రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ తన మిత్రులకు దోచి పెడుతుంటే... సిఎం కెసిఆర్ రాష్ట్ర సంపదను తన కుటుంబ సభ్యులకు దోచి పెడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. బిజిపిది విభజించు, పాలించు విధానమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి.. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలోఉన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా పార్టీ నేతలతో కలిసి ఆయన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారని గుర్తు చేశారు.

'రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారని తెలిపారు. స్థానిక సంస్థలను బలోపేతం చేశారు.దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని వివరించారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారని తెలిపారు. సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఆయన..'ఐటీ రంగంలోనే కాదు, టెలికాం రంగంలోనే సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబమని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఆయన స్ఫూర్తితో మళ్లీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. మణిపూర్ మండుతున్నా.. ప్రధాని అక్కడి ప్రజలకు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ నాణానికి బొమ్మా, బొరుసులాంటివన్నారు. వారిద్దరిది ఫెవికాల్ బంధమని మరోసారి ఎద్దేవా చేశారు.

రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డికి రేవంత్ శుభాకాంక్షలు

కాంగ్రెస్ అత్యున్నత స్థాయి కమిటీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) అవకాశాలు వచ్చిన ప్రతిఒక్క నాయకులకు రేవంత్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుంచి మాజీ డిప్యూటీ సిఎం దామోదర్ రాజానర్సింహ, ఎఐసిసి కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డికి అవకాశం ఇచ్చినందుకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయండి

- టిజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. యాత్ర విజయవంతం కోసం ఆదివారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం పరిధిలోని ముదిమాణిక్యం, గోన్య తండా, దుద్య తండా, జిలకర కుంట తండా, కొత్తూరు, చింత చెట్టు తండా, మొల్కచర్ల, చిట్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సమస్యలు, పోడు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. బిజెపి విధానాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, దానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించడానికి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం అడవిదేవులపల్లి మండలానికి వస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చైతన్య యాత్రలో పాల్గొంటున్నారని, ఈ యాత్రలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధీరావత్ రవి నాయక్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, మండల కార్యదర్శి జిటంగి సైదులు, శివ, సర్వయ్య, రాంబాబు, కోటి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- దారుణంగా దిగజారిన భారత ఆర్థిక వ్యవస్థ
- పెరిగిన నిరుద్యోగం
- క్షీణిస్తున్న ప్రయివేటు పెట్టుబడులు
- 'ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' పుస్తక పరిచయంలో పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారత దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదస్థితిలో ఉందని ప్రముఖ రచయిత పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల వ్యూహ రచనలో ఎక్కడో లోపం కనిపిస్తున్నదని సందేహం వ్యక్తం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, మంచి పుస్తకం సంస్థల సంయుక్తాధ్వర్యంలో పరకాల ప్రభాకర్ రచించిన "ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా" పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా 23 శాతం యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారనీ, నిరుద్యోగ సూచీల్లో భారతదేశం స్థానం లెబనాన్, లిబియా, ఇరాన్ వంటి దేశాల సరసన ఉందని తెలిపారు. దేశంలో 2014–15 నాటికి 120 మంది బిలియనీర్లు ఉంటే, గడచిన పదేండ్లలో వీరి సంఖ్య 145కి పెరిగిందనీ, అదే సమయంలో 84 శాతం మంది ప్రజల నికర ఆదాయం క్రమంగా పడిపోతున్నదని విశ్లేషించారు. జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో తయారీ రంగం పూర్తిగా కుదించుకుపోతున్నదనీ, కేంద్ర ప్రభుత్వం సాధించినట్టు చెప్తున్న 7 శాతం జిడిపిలో ఈ రంగానికి ఉన్న వాటా కేవలం 1.3 శాతం మాత్రమేనని తెలిపారు. భారతదేశంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నా, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వారెవరూ ఆసక్తి చూపట్లేదన్నారు. గడచిన ఏడేండ్లలో ఏటా సగటున 1.5 లక్షల మంది భారతదేశ పౌరసత్వం వదులుకొంటున్నారనీ, ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేముందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలు కేవలం ప్రచారం కోసం ఏర్పాటు చేసుకున్నవే తప్ప, అమలు ఎక్కడా లేదన్నారు. 'బేటీ బచావ్–బేటీ పడావ్' నినాదంతో కేంద్రం ప్రకటించిన ఈ స్కీంకు కేటాయించిన నిధుల్లో 80 శాతం కేవలం ప్రచారం కోసమే ఖర్చు చేశారని ఉదహరించారు. గడచిన పదేండ్లలో పెట్టుబడిదారులు బ్యాంకుల్లో చేసిన రూ.13 లక్షల కోట్ల అప్పుల్ని రద్దు చేశారనీ, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ.100 లక్షల కోట్ల అప్పులు చేసిందని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి ఇంతకంటే ఉదాహరణలు ఇంకేం కావాలని అడిగారు. దేశంలో 3 కోట్ల కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలేసి, ఉపాధి కోసం వలసలు వెళ్లిపోయాయనీ, గ్రామీణ భారతం దుస్థితికి ఇది నిదర్శనమని అన్నారు. ఇన్ని వైఫల్యాలు ఉన్నా, ఎన్నికలు జరిగిన ప్రతిచోటా బిజెపి తిరిగి అధికారంలోకే వస్తున్నదన్నారు. తమ మతానికి వారేదో చేస్తారనే మెజారిటీ ప్రజల భ్రమలే దీనికి ప్రధాన కారణమనీ, అందువల్లే వారు ప్రశ్నించేందుకు సిద్ధపడట్లేదని విశ్లేషించారు. ఈ భ్రమల్ని తొలగించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత కచ్చితంగా పౌరసమాజం, మేథావీవర్గం, ప్రతిపక్ష రాజకీయపార్టీలపైనే ఉన్నదని అభిప్రాయపడ్డారు. పుస్తక విశ్లేషణ చేసిన బహుగ్రంథ రచయిత ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి మాట్లాడుతూ పెట్టుబడిదారులు తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణ కోసమే 'హిందూత్వ'ను తెచ్చిపెట్టుకున్నారని విమర్శించారు. 'మంచిపుస్తకం' సమన్వయకర్త కొండూరి వీరయ్య మాట్లాడుతూ ప్రజల భాష, ప్రతిపక్షాల భాష వేర్వేరుగా ఉంటున్నాయని అన్నారు. 'హిందుత్వ' అంటే హిందువులను దూషించినట్టు భావిస్తున్నారనీ, దీనికి ప్రత్యామ్నాయ పదాల సృష్టి జరగాలని చెప్పారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు పరకాల ప్రభాకర్ సమాధానాలు చెప్పారు.

ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలి

- 30 ఏళ్లుగా నివాసముంటున్న మాకు ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ కూలి పనులు చేసుకుంటూ 30 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో జీవిస్తున్న తమకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని మిర్యాలగూడ మండలం జంక్ తండా గ్రామస్తులు కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు మాట్లాడారు. 30 ఏళ్లుగా జంకుతండ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకొని దాదాపు 20 కుటుంబాలు నివసిస్తున్నామన్నారు. కాగా, ఈ భూమిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలన్న నిర్ణయంతో తమను ఖాళీ చేయించే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తాము గతంలో ఆర్డీఓ, కలెక్టర్‌కు సైతం వినతి పత్రాన్ని అందించామన్నారు. అయినప్పటికీ మిర్యాలగూడ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు, తమ స్థలాన్ని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తుండటంతో హైకోర్టును సైతం ఆశ్రయించామన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం తగు విచారణ చేసి నివాసం ఉంటున్న వారికి న్యాయం చేయాలని చెప్పినప్పటికీ వినలేదని ఆరోపించారు. జంకుతండా సర్పంచ్, అధికార పార్టీ నేత మాలోత్ రవీందర్ నాయక్ పేదల అధీనంలో ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా, పట్టా భూమిగా చూపించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పేరుతో స్వాహా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బాధితులు బాలాజీ నాయక్, హరినాయక్, రామి, శారద, పిక్లి, పద్మ, సీతాలి, సరోజ, రజినీ తదితురులున్నారు.

యువత నిర్ణయాలు భావితరానికి మార్గదర్శకం

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

యువత నిర్ణయాలు భావితరానికి మార్గమంటూ ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. యువత అండదండలతోనే రాష్ట్రం పురోగతి సాధించిందని చెప్పారు. యువత తీసుకుంటున్న నిర్ణయాలతోనే ప్రజల్లో మార్పు వస్తుందని చెప్పారు. నాయకులు ఎక్కడ గొప్పగా ఆలోచన చేస్తారో అక్కడ అభివృద్ధి ఉంటుందన్నారు. ఇందుకు యువత ప్రోత్సాహం కూడా ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉన్నత చదువులు, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం యువత హైదరాబాద్ నగరంలో స్థిరపడడం సంతోషకరమైన విషయమని అన్నారు.

మహిళ కడుపులో 110 కిలోల కణితిని

- తొలగించిన నిమ్స్ వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ మహిళ కడుపులో 110 కిలోల బరువు ఉన్న కణితిని శస్త్ర చికిత్స ద్వారా నిమ్స్ వైద్యులు తొలగించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కుసునూరు లక్ష్మి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం సమస్య తీవ్రం కావడంతో కుటుంబీకులు స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో భారీ కణితి ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన ఆంకాలజీ సర్జికల్ వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. విభాగాధిపతి రాజశేఖర్, వైద్య బృందం ఆమెకి ఆపరేషన్ చేసి కడుపులోని 110 కిలోల కణితిని విజయవంతంగా తొలగించారు.